సాక్షి కామారెడ్డి

బుధవారం ¦ 28 ¦ జూన్ ¦ 2023



రూ. 2 లక్షల రుణమాఫీ
రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రూ. 2 లక్షల పంట రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ నేతలు హామీ ఇస్తున్నారు.
- 9లో ▸



రైతు ప్రభుత్వం
దేశంలో ఉన్న ఏకైక రైతు ప్రభుత్వం తమదేనని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు.
- 9లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32.2 /22.7
ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలు ప్రాంతాలలో ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'మృతుల పేర్లను తొలగించాలి'



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ కాలనీలో ఓటరు జాబితాను మంగళవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి జాబితాలో ఉన్న వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకోవాలన్నారు. మృతి చెందిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ వెంకట్‌రావు, అధికారులు ఉన్నారు.

'విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి'



కామారెడ్డి టౌన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పంపరి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం డీఈవో రాజును కలిసి వినతి పత్రం ఇచ్చారు. మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం సరఫరా చేయాలని, సర్కారు బడుల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి'



భిక్కనూరు: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే తమను రెగ్యులరైజ్ చేయాలని భిక్కనూరులోని తెయూ సౌత్ క్యాంపస్ కాంట్రాక్టు అధ్యాపకులు కోరారు. ఈ విషయమై మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. 13 ఏళ్లుగా కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తున్న తమను క్రమబద్ధీకరించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దత్తహరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా, ప్రతినిధులు రామలింగం, నరసయ్య, నాగేశ్వర్‌రావు, శరత్, గంగకిషన్, శ్రీనివాస్, నాగేంద్రబాబు, జోత్స్న, శ్రీకాంత్, రాజేశ్వర్, గంగాధర్, గోపి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఏఎన్‌ఎం పోస్టులు భర్తీ చేయనున్నారు. 11 ఏఎన్‌ఎం పోస్టులు ఉన్నాయని, ఆసక్తిగలవారు వచ్చేనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ. 22,750ల వేతనం అందిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని రూమ్ నంబర్ 208లో సంప్రదించాలని సూచించారు.

2న క్విజ్ పోటీ




కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రెండో తేదీన రాజీవ్ గాంధీ యూత్ క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులతో కలిసి క్విజ్ పోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసక్తి గల 16 నుంచి 35 ఏళ్ల మధ్య వయసువారు అర్హులన్నారు. 76618 99899 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే లింక్ వస్తుందని, దాంట్లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో ఈ పోటీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రోషన్, ప్రవీణ్‌రెడ్డి, సురేష్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఆ సార్లు.. బడికి వెళ్లరు!

- పాఠశాలలు పునఃప్రారంభమై పక్షం రోజులు
- దుమ్మాలు కొడుతున్న పలువురు మాస్టార్లు
- పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యం

పాఠశాలలు పునఃప్రారంభమై పక్షం రోజులు గడిచాయి. చాలామంది ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా బడికి వెళ్తున్నా.. కొందరు మాత్రం దుమ్మాలు కొట్టడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. రాజకీయ నాయకులతో అంటకాగుతూ కొందరు, యూనియన్ల పేరుతో ఇంకొందరు, సొంత వ్యాపారాల్లో మరికొందరు బిజీగా ఉండి విధులకు వెళ్లడం లేదు. ఎప్పుడూ బయటే కనిపిస్తున్న ఆ సార్లను చూసి జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



సాక్షి, కామారెడ్డి: జిల్లాలో 187 ఉన్నత పాఠశాలలు, 127 ప్రాథమికోన్నత పాఠశాలలు, 697 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు లక్ష మంది విద్యార్థులు చదువుతున్నారు. వారి విద్యనందించేందుకు 4,024 మంది ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారు. వేసవి సెలవుల అనంతరం బడులు ప్రారంభమై రెండు వారాలు గడిచిపోయాయి. చాలామంది ఉపాధ్యాయులు విధులకు వెళ్తున్నారు. కొందరు టీచర్లు మాత్రం బడికి అప్పుడప్పుడు వెళ్లి వస్తుండగా, ఇంకొందరు వారానికో రోజు కూడా వెళ్లడం లేదు. ఓ ఉపాధ్యాయుడైతే నిత్యం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతోనే తిరుగుతున్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకల్లో వ్యాఖ్యాతగా వ్యవహరించిన సదరు ఉపాధ్యాయుడు రోజుల తరబడిగా స్కూల్‌కు వెళ్లడం లేదని తెలుస్తోంది. బడికి వెళ్లకుండా ప్రజాప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ, ఆ రోజు అక్కడే గడుపుతున్నారు. వేదిక, మైకు అంతా తన కనుసన్నల్లో నడిచేలా చూసుకుంటున్నారు. సభలకు హాజరయ్యే అధికారులు కుర్చీలు లేక నిల్చున్నా సరే సదరు ఉపాధ్యాయుడు వేదిక మీద ప్రజాప్రతినిధుల పక్కన కూర్చుని తన దర్పాన్ని ప్రదర్శించడంపై విమర్శలు వస్తున్నాయి. జిల్లా స్థాయి అధికారులకు ఆయన వైఖరి మింగుడు పడడం లేదు. అయితే ఎమ్మెల్యేలతో చనువుగా ఉంటూ తమనే డామినేట్ చేస్తున్నాడని ఓ అధికారి 'సాక్షి'తో ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి అయితే ఆ ఉపాధ్యాయుడి గురించి అడిగితే దండం పెట్టి జారుకుంటున్నట్లు తెలిసింది.

కామారెడ్డి మండలంలో పనిచేసే సదాశివనగర్ మండలానికి చెందిన ఉపాధ్యాయుడి భార్య స్థానిక సంస్థల ప్రజాప్రతినిధి.. దీంతో ఆమె స్థానంలో ఆయనే అంతా తానై వ్యవహరిస్తారు. ఆయన నిత్యం రాజకీయ నాయకులతోనే ఉంటారని, బడి, పిల్లలు, చదువు పట్టించుకోరని విమర్శలున్నాయి. ఇక యూనియన్ల పేరుతో కొందరు, వ్యాపారాల్లో మరికొందరు నిత్యం బిజీగా ఉంటున్నారు. ఉపాధ్యాయ వృత్తిని నిర్లక్ష్యం చేస్తూ, దుమ్మాలు కొడుతూ సొంత వ్యవహారాలను చక్కబెట్టుకుంటున్నవారి వల్ల విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. ఇలాంటి వారి మూలంగా మొత్తం ఉపాధ్యాయ లోకానికి చెడ్డపేరు వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 'కొందరు' ఉపాధ్యాయులు స్కూళ్లకు వెళ్లకుండా బయట తిరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారి పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. కొందరు దుమ్మాల మాస్టార్లతో అధికారులు కుమ్మక్కయ్యారన్న ఆరోపణలూ ఉన్నాయి.

చర్యలేవి?

ఉపాధ్యాయుల దుమ్మాలను అరికట్టి హాజరులో పారదర్శకత పెంపొందించేందుకు ప్రభుత్వం బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలులోకి తెచ్చింది. అయితే సమయ పాలన పాటించని వారిపై అధికారులు చర్యలు తీసుకుని ఉంటే విద్యార్థులకు న్యాయం జరిగేది. కానీ సమయ పాలన పాటించనివారి విషయంలో ఉన్నతాధికారులు కనీసం మందలించిన పాపాన పోలేదు. ఒక్కరికి కూడా మెమో ఇచ్చిన దాఖలాలు లేవు. దీంతో తమను ఎవరూ ఏం చేయలేరన్న భావనతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎప్పటికప్పుడు బడులను తనిఖీ చేసి ఉపాధ్యాయులు సమయానికి హాజరవుతున్నారా? విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారా? అన్న విషయాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, దుమ్మాలు కొట్టే మాస్టార్లపై దృష్టి సారించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

సర్కారు బడికి పూర్వ వైభవం



సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

- మన ఊరు – మనబడితో విద్యార్థుల సంఖ్య పెరిగింది
- జెడ్పీ చైర్‌పర్సన్ శోభ
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ప్రారంభం

కామారెడ్డి అర్బన్: మన ఊరు – మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల మౌలిక సదుపాయాలతో పూర్వవైభవం వచ్చిందని జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ పేర్కొన్నారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, పనులు, ఆర్థిక, ప్రణాళిక స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. నిజాంసాగర్ మండలం సింగితం వాగుపై వంతెన నిర్మాణానికి టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులు చేపట్టాలని చైర్‌పర్సన్ శోభ సూచించారు. హరితహారంలో రోడ్ల వెంట నాటుతున్న మొక్కల్లో 50 శాతం వృథాగా పోతున్నాయని సభ్యులు పేర్కొన్నారు. పనికివచ్చే మొక్కలు, పండ్ల మొక్కలు నాటాలని సూచించారు. పెన్షన్లు మంజూరు కాక వితంతువులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మంజూరయ్యేలా చూడాలని కోరారు. కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. సాంకేతిక కారణాలతో కొందరికి సదరం సర్టిఫికెట్లు మంజూరవడం లేదని, ఈ సమస్యను పరిష్కరించడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైద్యాధికారులను ప్రశ్నించారు. ఆయా సమావేశాలలో నాగిరెడ్డిపేట, గాంధారి, లింగంపేట, మాచారెడ్డి, రాజంపేట జెడ్పీటీసీ సభ్యులు మనోహర్‌రెడ్డి, శంకర్‌నాయక్, శ్రీలత, ఎం.రాంరెడ్డి, కొండా హన్మాండ్లు, జెడ్పీ సీఈవో డి.సాయాగౌడ్, డీఆర్‌డీవో సాయన్న, డీఈవో ఎస్.రాజు, డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

30న వ్యవసాయంపై..

వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, మహిళా, శిశు సంక్షేమం స్థాయీ సంఘ సమావేశాలను శుక్రవారం నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో తెలిపారు.

రూ.154 కోట్లకు తగ్గిన ఎన్‌పీఏ

- రికవరీ సిబ్బందికి చైర్మన్లు మరింత సహకరించాలి
- ఓటీఎస్ గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగింపు
- 101వ మహాజన సభలో డీసీసీబీ వైస్ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి

సుభాష్‌నగర్ : నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ నిరర్థక ఆస్తుల విలువ (ఎన్‌పీఏ)ను రూ.220 కోట్ల నుంచి రూ.154 కోట్లకు తగ్గించడం అభినందనీయమని, ఎన్‌పీఏ మరింత తగ్గేలా చైర్మన్లు, బ్యాంకు సిబ్బంది కృషి చేయాలని డీసీసీబీ వైస్ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి సూచించారు. మంగళవారం వైఎస్‌ఆర్ సహకార భవనంలో జరిగిన డీసీసీబీ 101వ మహాజన సభకు ఆయన అధ్యక్షత వహించారు. బ్యాంకు సీఈవో గజానంద్ నివేదికను చదివారు. రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌పీఏ రికవరీ సిబ్బందికి చైర్మన్లు సహకరించాలని, తద్వారా మరింత మంది రైతులకు నూతనంగా రుణాలు ఇవ్వడానికి అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించామన్నారు. బ్యాంకు ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో హౌజింగ్ రుణాలు, విద్య, కార్లు, తదితర వాటికి రుణాలు అందించనున్నామన్నారు. బంగారు ఆభరణాలపై రూ.200 కోట్ల వరకు రుణాలు ఇచ్చామని, ఈయేడాది రూ.50 కోట్ల వరకు రుణాలు పెంచామన్నారు. రైతులకు వానాకాలం పంటరుణాలు ఇస్తున్నారని తెలిపారు. జీవోనెంబర్ 44 ప్రకారం మార్జిన్ అకౌంట్‌లో నగదు జమ చేసుకున్న తర్వాతే రుణాలకు సంబంధించి మిగతా సొమ్ము బ్యాంకు ఖాతాలో జమ చేయాలని సూచించారు. బ్యాంకు రూ.2.58 కోట్ల వార్షిక లాభంలో ఉందన్నారు. బ్యాంకు డిపాజిట్లు రూ.614 కోట్ల నుంచి రూ.641.64 కోట్లకు పెరిగాయన్నారు. ఈ సందర్భంగా ప్రొటోకాల్, గోనె సంచులు, కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు, గోదాములకు రుణాలు తదితర అంశాలను సొసైటీ చైర్మన్లు ప్రస్తావించారు. సభ్యులు ప్రస్తావించిన అంశాలపై వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, సీఈవో గజానంద్, డీసీవో సింహాచలం సంతృప్తికరమైన వివరణ ఇచ్చారు. సభలో డీసీసీబీ డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గోర్కంటి లింగన్న, శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

డయాగ్నోస్టిక్ హబ్ ప్రారంభం



హబ్‌ను ప్రారంభిస్తున్న గంప గోవర్ధన్

కామారెడ్డి టౌన్: పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా అన్ని రకాల ఆరోగ్య, రక్తపరీక్షలు అందించేందుకు తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటు చేశామని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. మంగళవారం ఆయన కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లి శివారులో ఏర్పాటు చేసిన డయాగ్నోస్టిక్ హబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ. 1.25 కోట్లతో ఈ డయాగ్నోస్టిక్ హబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ హబ్‌లో సేవలు ఉచితమన్నారు. అవసరమైనవారు డయాగ్నోస్టిక్ హబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుప్రియ, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేంకుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పెరుగు వెంకటేశ్వర్లు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల వద్ద ప్రొఫెసర్లు, అధికారులతో ప్రభుత్వ విప్ గోవర్ధన్

మెడికల్ కళాశాల పరిశీలన

కామారెడ్డి టౌన్: జిల్లా మెడికల్ కళాశాల భవనాన్ని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మంగళవారం పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట కలెక్టర్ జితేష్ వి పాటిల్, డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్, డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, వైద్య కళాశాల ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యులు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

ధరదడ!

- మండుతున్న కూరగాయల ధరలు
- కిలో టమాట రూ. 100
- అన్ని కూరగాయలదీ అదేదారి..
- ఆందోళనలో సామాన్యులు



నాగిరెడ్డిపేట/నిజాంసాగర్ : కూరగాయల ధరలు గుండెల్లో దడ పెంచుతున్నాయి. పక్షం రోజుల క్రితం కిలో రూ. 15 ఉన్న టమాట.. ప్రస్తుతం రూ. 100కు చేరింది. అన్ని కూరగాయలదీ కాస్త అటూ ఇటుగా అదే పరిస్థితి. మండుతున్న ధరలతో సామాన్యులు ఇబ్బందిపడుతున్నారు. రెండు నెలల క్రితం కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగళ్లతో కూరగాయల పంటలు కొంత దెబ్బతిన్నాయి. ఆ తర్వాత ఎండల తీవ్రతతో మొక్కలు ఎదగక మరింత నష్టం వాటిల్లింది. దీంతో స్థానికంగా కూరగాయల ఉత్పత్తి తగ్గింది. డిమాండ్‌కు సరిపడా కూరగాయలు మార్కెట్‌కు రాకపోవడంతో ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. టమాట ధర కిలోకు వంద రూపాయలకు చేరగా.. బీరకాయ, కాకరకాయ, వంకాయ, బెండకాయలు రూ. 80కి చేరాయి. వారం పదిరోజుల్లోనే ధరలు రెట్టింపయ్యాయని ప్రజలు పేర్కొంటున్నారు. రూ.500 నోటు తీసుకొని మార్కెట్‌కు వెళ్తే సంచినిండా కూరగాయలు కూడ రావడంలేదంటున్నారు. ధరలు పెరగడంతో ఏం కొనాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేద, మధ్య తరగతివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని రకాల కూరగాయల ధరలు పెరగడంతో కిలో కొనేచోట అర కిలో లేదా పావు కిలోతో సరిపెట్టుకుంటున్నామంటున్నారు. కొత్త పంట వచ్చేసరికి మరో నెల రోజులు పట్టొచ్చని, అప్పటివరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

కొరవడిన ప్రభుత్వ ప్రోత్సాహం...

గతంలో కూరగాయలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందేది. సబ్సిడీపై కూరగాయల విత్తనాలను అందించేవారు. దీంతో పాటు కూరగాయల సాగుకు అవసరమైన డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు, మల్చింగ్ షీట్లు సబ్సిడీపై సరఫరా చేసేవారు. పందిరిసాగుకు సంబంధించిన స్తంభాలు, వైర్లు, కూరగాయలను తరలించే ప్లాస్టిక్ పెట్టెలను కూడా అందించేవారు. ప్రస్తుతం ప్రోత్సాహం లేకపోవడంతో రైతులు కూరగాయల సాగుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలోకు రూపాయలలో)			
టమాట	100	క్యాబేజీ	60
బీరకాయ	80	పాలకూర	80
కాకరకాయ	80	తోటకూర	60
పచ్చిమిర్చి	120	కొత్తిమీర	160
వంకాయ	80	క్యారెట్	100
బెండకాయ	80	బీట్‌రూట్	100
గోరుచిక్కుడు	60	ఆలుగడ్డ	40
దొండకాయ	60	అల్లం	200
క్యాప్సికం	80	వెల్లుల్లి	160
కాలీఫ్లవర్	80		

'కేంద్ర పథకాలపై అవగాహన కల్పించండి'



మాట్లాడుతున్న యెండల లక్ష్మీనారాయణ

బిచ్కుంద: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం బిచ్కుందలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. పార్టీ బలం పుంజుకుందని, సర్వేలు కూడా అనుకూలంగా వచ్చాయని పేర్కొన్నారు. కేంద్ర పథకాలు ప్రజలకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కిష్టారెడ్డి, నాయకులు అభినయ్‌రెడ్డి, శివాజీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

వైభవంగా జగన్నాథ రథయాత్ర

కామారెడ్డి టౌన్: ఇస్కాన్ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాకేంద్రంలో జగన్నాథ రథయాత్రను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబా ఆలయం వద్ద ప్రారంభమైన రథయాత్ర జన్మభూమిరోడ్, జీవదాన్ స్కూల్, నిజాంసాగర్ రోడ్, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, రైల్వే కమాన్, సిరిసిల్ల రోడ్, తిలక్ రోడ్, సుభాష్ రోడ్, జేపీఎన్ రోడ్ మీదుగా కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు సాగింది. బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి తోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌ల పంపిణీ



నిజామాబాద్‌అర్బన్‌: ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు డిజిటల్ విద్యాబోధనలో భాగంగా మంగళవారం డీఈవో దుర్గాప్రసాద్ ట్యాబ్‌లను మంగళవారం పంపిణీ చేశారు. 890 పాఠశాలలకు ఈ ట్యాబ్‌లను అందించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో హెచ్‌ఎంలు వీటిని అందుకున్నారు. డిజిటల్ విద్యను పకడ్బందీగా అందించాలని విద్యార్థులకు ఆంగ్ల విద్యతో పాటు డిజిటల్ విద్యలో మరింత మెరుగుపరచాలని ఈ సందర్భంగా డీఈవో హెచ్‌ఎంలకు సూచించారు.

సీడ్స్ కార్పొరేషన్‌లో అందుబాటులో విత్తనాలు

డొంకేశ్వర్(ఆర్మూర్): ఉమ్మడి జిల్లా రైతులకు వానాకాలం సీజన్‌కు అవసరమయ్యే అన్ని రకాల విత్తనాలను సీడ్స్ కార్పొరేషన్‌లో అందుబాటులో ఉంచినట్లు ఆర్‌ఎం విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరి, అపరాలు, పచ్చి రొట్ట విత్తనాలు ఉమ్మడి జిల్లాలోని అన్ని సొసైటీల్లో ఉంచామని, రైతులు కొనుగోలు చేసి తీసుకెళ్లాలని సూచించారు. జీలుగ, జను ము విత్తనాలను 65శాతం సబ్సిడీపై అందజేస్తున్నామని, ఈ నెలాఖరు వరకే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా పంపిణీ కేంద్రాల్లో వరి 15,500 క్వింటాళ్లు, పచ్చిరొట్ట 16,800 క్వింటాళ్లు, అపరాలు 175 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): తెలంగాణ వర్సిటీ పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం కొనసాగాయి. ఉదయం 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షకు 2,819 మంది విద్యార్థులకు గాను 2619 మంది హాజరు కాగా, 200 మంది గైర్హాజరయ్యారని టీయూ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన యూజీ 1వ, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షకు 181 మంది విద్యార్థులకు గాను 159 మంది హాజరయ్యారని, 22 మంది గైర్హాజయ్యారని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

నిజామాబాద్‌అర్బన్‌: యూపీఎస్సీ పరీక్ష రాయాలనుకునే అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ అధికారిణి శశికళ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 3 లక్షల కంటే తక్కువ ఉండాలన్నారు. జూలై 2వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 9న హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ జిల్లా కేంద్రాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

గురుపౌర్ణమికి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి : గురుపౌర్ణమి సందర్భంగా జూలై 3న తమిళనాడులోని అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు నిజామాబాద్ నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్లు ఆర్‌ఎం ఉషాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ కింది ఫోన్ డిపో మేనేజర్, నిజామాబాద్-1, 9959226016, డిపో మేనేజర్, నిజామాబాద్-2, 99592 26017 నంబర్లను సంప్రదించాలన్నారు. ప్రయాణికులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దోపిడీ కేసులో నిందితుల అరెస్టు

- రెండు బైక్‌లు స్వాధీనం
- పరారీలో ఒకరు
- వివరాలు తెలిపిన ఏసీపీ కిరణ్‌కుమార్



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్, పక్కన ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు

ఖలీల్‌వాడి: బోధన్ మండలం ఎరాజ్‌పల్లికి చెందిన పోతుల పోశెట్టి వద్ద దోపిడీకి పాల్పడిన నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా.. ఒకరు పరారీలో ఉన్నట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వివరాలు వెల్లడించారు. ఎరాజ్‌పల్లికి చెందిన పోతుల పోశెట్టి(55) నుంచి దోపిడీ పాల్పడిన కేసులో ఆర్మూర్‌లోని సంతోష్‌నగర్‌లో నివాసముంటున్న నల్ల నవీన్, ఇదే కాలనీలో ఉంటున్న గడ్డల దామోదర్, రాస ప్రవీణ్, ఒడ్డెర కాలనీకి చెందిన మేకల హరీశ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా దారంగుల గంగాధర్ పరారీలో ఉన్నాడు. ఈ ఐదుగురు జల్సాల కోసం డబ్బు సంపాదించడానికి దోపిడీ మార్గాన్ని ఎంచుకున్నారు. ఈ క్రమంలో నిందితులు రెండు మోటార్ సైకిళ్లపై ఈనెల 23న నిజామాబాద్‌కు బయలు దేరినట్లు వెళ్లారు. గంగాధర్, ప్రవీణ్, హరీశ్, దామోదర్‌లు చిన్నాపూర్ గండి వద్ద కట్టెలు, స్క్రూ డ్రైవర్‌లతో వేచి ఉన్నారు. నల్లనవీన్ నిజామాబాద్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌కు అతని మోటార్ సైకిల్‌పై వచ్చి అక్కడ టీతాగుతున్న పోతుల పోశెట్టి దగ్గరకు వెళ్లి అతన్ని చంపుతానని బెదిరించాడు. అతడిని మోటార్ సైకిల్‌పై కూర్చోబెట్టుకొని చిన్నాపూర్ గండి వద్దకు తీసుకువెళ్లాడు. అక్కడ నిందితులు బాధితుడిని బెదిరించి స్క్రూడ్రైవర్‌తో పొడిచి కట్టెలతో కొట్టి బాధితుడి వద్ద ఉన్న వెండి, బంగారపు వస్తువులతో పాటు రూ. 600 దోపిడీ చేశారు. అంతేకాకుండా బాధితుడిని ఎరాజ్‌పల్లిలో తన ఇంటికి తీసుకువెళ్లి ఇంట్లో ఉన్న రూ. 35వేలు దోచుకున్నారు. అనంతరం బాధితుడిని మామిడిపల్లి రోడ్ వద్ద వదిలి ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా పట్టుకొని కోర్టులో హాజరుపర్చారు. కేసును ఛేదించిన ఎస్‌హెచ్‌వో విజయ్ బాబు, ఎస్సై హబీబ్ ఖాన్‌తో పాటు పోలీసు సిబ్బందిని ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్ కుమార్, ఏసీపీ కిరణ్‌కుమార్ అభినందించారు.

జూలై 1 నుంచి ఆపరేషన్ ముస్కాన్–9



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ(అడ్మిన్) మధుసూదన్‌రావు

- డీసీపీ(అడ్మిన్) మధుసూదన్‌రావు

ఖలీల్‌వాడి: జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహించాలని డీసీపీ(అడ్మిన్) మధుసూదన్‌రావు ఆదేశించారు. ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌లో వివిధ శాఖల అధికారులతో ఆపరేషన్ ముస్కాన్-9 సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ(అడ్మిన్)మాట్లాడుతూ నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 18 ఏళ్లలోపు తప్పిపోయిన, వదిలేసిన, కార్మికులుగా ఉన్న బాలబాలికలు ఉన్నట్లయితే.. అలాంటి వారి సమాచారం సేకరించి రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించాలన్నారు. బాలలతో బలవంతంగా భిక్షాటన చేయించిన వారిపై, వెట్టి చాకిరి చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ప్రత్యేకంగా డివిజన్ పరిధిలో ఎస్సై, నలుగురు సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. ప్రజలు తప్పిపోయిన బాలురు, బాలికలు ఉన్నట్లయితే అలాంటి వారి సమాచారం, బాలకార్మికుల గురించి సమాచారం తెలిస్తే డయల్ 100, స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూం సెల్ నెంబర్ 87126-59777, నిజామాబాద్ ఇన్‌చార్జి ఎస్సై 80965-73004, ఆర్మూర్ ఇన్‌చార్జి ఎస్సై 94401-40022, బోధన్ ఇన్‌చార్జి ఎస్సై 94412-50992 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. సమావేశంలో ఎస్‌బీ శ్రీశైలం, సీసీఆర్‌బీ మోహన్, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ గోపీనాథ్, జిల్లా లేబర్ ఆఫీసర్ యోహన్, జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ సంపూర్ణ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్య, బాల రక్ష భవన్ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి, నిజామాబాద్ ఇన్‌చార్జి మహిళా ఆర్‌ఎస్సై స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

బావమరిదిపై హత్యాయత్నం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

బాన్సువాడ: తన అక్కను నిత్యం వేధిస్తున్నాడని పలుమార్లు పంచాయితీ పెట్టించిన బావమరిదిపై బావ కక్ష పెంచుకుని హత్యాయత్నానికి పాల్పడిన ఘటన బీర్కూర్ మండలం అన్నారంలో చోటుచేసుకుంది. ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బీర్కూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన మస్కూరి మారుతి తన అక్కను అదే మండలం కిష్టాపూర్‌కు చెందిన కతిగామ రాములుకు ఇచ్చి వివాహం జరిపించాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాములు నిత్యం భార్యతో గొడవ పడేవాడు. దీంతో మారుతి పలుమార్లు కులపెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టించి రాములును మందలించారు. దీంతో మావమర్దిని హత్య చేయాలని రాములు పథకం వేశాడు. మారుతి మంగళవారం బైక్‌పై బాన్సువాడకు వస్తుండగా కొల్లూర్ వద్ద రాములు ఆటోలో వచ్చి అడ్డుపడ్డాడు. ఆటోలో ఉన్న సెంట్రింగ్ కట్టెతో మారుతి తలపై గట్టిగా కొట్టడంతో తలపగిలింది. దీంతో రాములు అక్కడి నుంచి పరారయ్యాడు. అటువైపుగా వచ్చిన కొందరు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మారుతిని బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. మారుతి కోమాలోకి వెళ్లడంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మారుతి పరిస్థితి విషమంగా ఉందని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. రాములుపై కేసు నమోదు చేశామని చెప్పారు.

టాస్క్‌ఫోర్స్‌కు టీమార్ట్ అగ్ని ప్రమాదం కేసు

- గతంలో రాజకీయ అండతో ఆగిన కేసు విచారణ ?
- కేసును పక్కదారి పట్టించడానికి ముడుపులు !



మంటల్లో కాలిపోయిన షాపు(ఫైల్)

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని టీమార్ట్ అగ్నిప్రమాదం కేసు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చేరింది. నగరంలోని హైదరాబాద్ రోడ్డులోని ఆర్య నగర్‌లో గల టీమార్ట్ సూపర్ మార్కెట్‌లో 2022 ఆగస్టు 28న రాత్రి 2 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. టీమార్ట్‌లో ఉన్న సుమారు రూ. 2 కోట్ల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమా లేక ఇతర కారణలున్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేశారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. కేసులో నగరంలోని ఓ ప్రజాప్రతినిధి బంధువుతో పాటు మరి కొందరు, ఓ పోలీస్ అధికారి ఎంట్రీ కావడంతో కేసు డీలా పడింది. ప్రమాదానికి కారణమైన ఆధారాలను సేకరించిన పోలీసులు.. కొన్నింటిని లేకుండా చేశారనే ఆరోపణలున్నాయి. దీంతో కేసు ఆలస్యం కావడంతో బాధితుడు కొంత కాలంగా పోలీసు అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నాడు. ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో టీమార్ట్ కేసు ఫైల్ మళ్లీ తెరపైకి వచ్చింది. కేసును ట్రాస్క్‌ఫోర్స్‌కు అప్పగించడంతో కేసు వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

రంగంలోకి టాస్క్‌ఫోర్స్

టీమార్ట్ అగ్నిప్రమాదం కేసును నీరుకార్చడానికి ప్రయత్నించిన ఓ ప్రజాప్రతినిధి బంధువు, ఓ పోలీసు అధికారి, కొంత మంది వివరాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. కేసును పక్కదారి పట్టించడానికి ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి. దీంతో 10 నెలలుగా కేసును పోలీసులు కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. తాజాగా ఈ కేసును మళ్లీ టాస్క్‌ఫోర్స్‌కు చేరడంతో ప్రజాప్రతినిధి బంధువుతో పాటు ఓ పోలీసు అధికారి, మరి కొందరు కలిసి బాధితుడితో ఒప్పందం పేరుతో రాజీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

మంత్రి, సీపీకి ఫిర్యాదు చేయడంతో..!

బాధితుడు శేఖర్ అగ్నిప్రమాదం కేసు విషయమై మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కేసును పరిశీలించాలని పోలీసులకు మంత్రి ఆదేశాలు జారీ చేయడంతో టీమార్ట్ కేసులో పురోగతి వచ్చిందనే ప్రచారం జరుగుతుంది. దీంతో ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కేసు వివరాలను సేకరించే పనిలో పడినట్లు తెలిసింది. కేసు ఈ సారైనా కొలిక్కి వస్తుందా లేదా అనే సందిగ్ధత నెలకొంది. అయితే కేసు విషయమై టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీధర్‌ను సంప్రదించగా ఇన్‌చార్జి సీపీ, ఏసీపీల ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

దమ్ము చక్రాల కిందపడి రైతు మృతి

ఎడపల్లి(బోధన్): మండలంలోని బ్రాహ్మణపల్లిలో ట్రాక్టర్ కేజీవీల్స్ కిందపడి ఓ రైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన లింగాగౌడ్(65) తన పొలంలో వరినాట్లు వేసేందుకు ట్రాక్టర్‌తో దమ్ము చేయించడానికి వెళ్లాడు. ట్రాక్టర్ డ్రైవర్ కేజీవీల్స్‌తో దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి రైతు లింగాగౌడ్ పైకి రావడంతో కేజీవీల్స్ కిందపడి బురదలో కూరుకుపోయాడు. తోటి రైతులు లింగాగౌడ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. లింగాగౌడ్ చిన్నాన్న కుమారుడు ఆనంద్ సాగర్ ఎడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎడపల్లి ఎస్సై పాండేరావు తెలిపారు.

గంజాయి తరలిస్తుండగా పట్టివేత



పట్టుబడిన నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

సిరికొండ: సిరికొండ నుంచి కొండూర్ వెళ్లేమార్గంలో గంజాయి తరలిస్తున్న నిందితుడిని మంగళవారం పట్టుకున్నట్లు భీమ్‌గల్ ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్ తెలిపారు. దాడిలో 950 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కొండూర్‌కు చెందిన బసాయి భాను, సిరికొండకు చెందిన వొల్లం వంశీ గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో దాడి చేయగా.. వంశీ పరారయ్యాడని సీఐ తెలిపారు. భానును అరెస్ట్ చేసి అతడి బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒడిశాలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి ఎండు గంజాయిని కొనుగోలు చేసి డిచ్‌పల్లి, ఇందల్‌వాయి, సిరికొండ, భీమ్‌గల్ మండలాల్లోని గ్రామాల్లో గంజాయిని విక్రయిస్తున్నారని సీఐ తెలిపారు. పరారీలో ఉన్న వంశీపై ఏపీలోని విశాఖ, రాజమండ్రి, జగిత్యాల పోలీస్ స్టేషన్స్‌లో గంజాయి కేసులు, దొంగతనం కేసులు ఉన్నాయని ఆయన తెలిపారు. దాడిలో సబ్ ఇన్‌స్పెక్టర్ నర్సింలు, సిబ్బంది ఫయాజ్, దత్తాద్రి, మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పిల్లల కుటుంబ సభ్యుల గుర్తింపు



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బస్టాండ్ వద్ద కనిపించిన బాలురు కిరణ్, కార్తీక్‌ల తల్లిని పోలీసులు గుర్తించారు. వర్ని మండలంలోని ఒడ్డేపల్లికి చెందిన కులకర్ణి స్వాతికి చెందిన పిల్లలుగా గుర్తించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. కులకర్ణి స్వాతి భర్త చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో పిల్లలను వదిలిపెట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు.

బూందీలో బల్లి



ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండలం జానకంపేటలోని శివాజీ చౌక్ వద్ద గల ఓ మిఠాయి భండార్‌లో నిజామాబాద్‌కి చెందిన ఓ వ్యక్తి కారా బూందీ కొనుగోలు చేసి.. తినడానికి పొట్లం విప్పగా అందులో కాలిపోయిన బల్లి అవశేషాలు కనిపించడంతో దిగ్భ్రాంతికి గురయ్యాడు. గ్రామంలోని మిత్రులకు తెలియజేయగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్టు

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని ఫత్లాపూర్‌లో గల హనుమాన్ మందిరం వెనుక మంగళవారం పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకున్నామని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి వారి నుంచి 59,670 రూ పాయలు స్వాధీనం చేసుకున్నామరు. పోలీస్ స్టేషన్‌కు తరలించి వారిపై కేసునమోదు చేశామన్నారు.


మట్కా ఆడుతున్న ముగ్గురిపై కేసు

మద్నూర్: మండల కేంద్రంలో మట్కా ఆడుతున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలో మట్కా ఆడుతున్న వారిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ. 3,600, రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా

బోధన్ టౌన్: మంజీర నది నుంచి మంగళవారం ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ బోధన్ పట్టణానికి వస్తుండగా పట్టణంలోని రాఘవులు రైస్‌మిల్ వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుక ట్రాక్టర్ పట్టుకున్న విషయమై సీఐ ప్రేమ్‌కుమార్‌ను సంప్రదించగా అదుపు తప్పి బోల్తాపడ్డ ఇసుక ట్రాక్టర్‌కు అనుమతి లేదని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఏళ్లనాటి మర్రి చెట్టుకు నిప్పు



గాంధారి(ఎల్లారెడ్డి): ఏళ్ల నాటి మర్రి చెట్టుకు దుండగులు నిప్పు పెట్టారు. గాంధారి–బాన్సువాడ రోడ్డు పక్కన తిమ్మాపూర్ బస్టాప్ వద్ద పెద్దమ్మ మర్రి చెట్టు ఉంది. అయితే సోమవారం రాత్రి దుండగులు చెట్టుకు నిప్పు పెట్టారు. మంగళవారం ఉదయం సమయంలో గమనించిన గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్ని సిబ్బంది వచ్చి నిప్పును ఆర్పి చెట్టును కాపాడారు. చెట్టు కింద పెద్దమ్మ ఆలయం ఉంది. దీంతో దీనిని పెద్దమ్మ మర్రి చెట్టని పిలుస్తారు.

14 తులాల బంగారం చోరీ



ఖలీల్‌వాడి: నగరంలోని ఐదోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొగల్‌పురా కాలనీలో హింగోరా మహమ్మద్ ఉస్మాన్ ఇంట్లో దొంగలు పడి 14 తులాల బంగారం, రూ. 37వేలు, మూడు సెల్‌ఫోన్‌లు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై సాయినాథ్ తెలిపారు. ఈ నెల 25న అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో మహమ్మద్ ఉస్మాన్, అతని భార్య మునిమా ఖాతూన్, కుమారుడు ఉమర్ ఇంట్లో మెయిన్ డోర్ పెట్టి బెడ్‌రూంలో నిద్రించారు. దుండగులు వాషింగ్ ఏరియా వెంటిలేషన్ నుంచి ఇంటి లోపలి ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డారు. ఉస్మాన్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలుడి అదృశ్యం



మహమ్మద్(ఫైల్)

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల హబీబ్ నగర్‌కు చెందిన షేక్ మహమ్మద్(15) అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ మహమ్మద్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 26న ఉదయం 9 గంటలకు ఆడుకోవడానికి బయటకు వెళ్లి సాయంత్రం వరకు తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో బాలుడి తల్లి తబసుం బేగం మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసినట్లయితే వన్ టౌన్ సీఐ సెల్ నెంబర్ 87126 59837, పోలీస్ స్టేషన్ ల్యాండ్ నంబర్ 08462-220150కు సమాచారం అందించాలని కోరారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు



కామారెడ్డి టౌన్: అపరిశుభ్ర వాతావరణం, నాణ్యత లేని ఆహార పదార్థాలు వినియోగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని కామారెడ్డి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శిరీష, ఫుడ్ సేఫ్టీ అధికారిణి సునీతలు హోటళ్ల యజమానులను హెచ్చరించారు. మంగళవారం కొత్త బస్టాండ్ ముందు గల ఓ హోటళ్లను తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉన్న హోటళ్లకు జరిమానాలు విధించారు. ఆహార పదార్థాలను నిల్వ ఉంచవద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీకి పాల్పడుతుండగా పట్టుకున్న పోలీసులు

- ముగ్గురి అరెస్టు
- నాలుగు బైక్‌ల స్వాధీనం
- పరారీలో ఒకరు



నిందితులను పట్టుకున్న రూరల్ పోలీసులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని చంద్రశేఖర్‌కాలనీలో బైక్ దొంగిలించేందుకు వచ్చిన ముగ్గురిని పట్టుకుని అరెస్టు చేసినట్లు మంగళవారం నిజామాబాద్ రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఘటనకు సంబంధించి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రశేఖర్ కాలనీలో మంగళవారం ఉదయం నాలుగున్నర గంటల సమయంలో నలుగురు వ్యక్తులు ఆటోలో వచ్చి ఓ ఇంటి ముందున్న బైకును దొంగలిస్తుండగా, గమనించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకోగా పోలీసులను చూసిన దొంగలు పారిపోతుండగా పోలీసులు ముగ్గురిని పట్టుకోగా.. ఒకడు తప్పించుకుని పారిపోయాడు. పట్టుబడిన వారిని పోలీసులు విచారించగా షేక్ కరీం ఖాన్ సోన్ బర్కత్‌పూర, షేక్ అజ్మత్ హైమద్‌పుర, మహ్మద్ అబ్దుల్ మోహిద్ హబీబ్‌నగర్ ప్రాంతాలకు చెందినవారీగా పోలీసులు గుర్తించారు. కాగా పారిపోయిన వ్యక్తి మదీనా ఈద్గా ప్రాంతానికి చెందిన అల్తాఫ్‌గా గుర్తించారు. పోలీసుల విచారణలో దొంగలు నాలుగు మోటారు సైకిళ్లను దొంగతనం చేసినట్లు తేలడంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుచగా, కోర్టు వారిని రిమాండ్‌కు పంపింది. దొంగలను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని సౌత్ రూరల్ సీఐ సురేందర్ రెడ్డి, ఏసీపీ కిరణ్‌లు అభినందించారు.

దొంగతనం కేసులో ఇద్దరికి ఏడాది జైలు

కమ్మర్‌పల్లి/ఖలీల్‌వాడి: కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు ఏడాది సాధారణ జైలు శిక్ష పడింది. ఈ కేసుకు సంబంధించి కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ తెలిపిన ప్రకారం.. 2022 సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లో కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనానికి గురయ్యాయి. పోలీసులు విచారణ చేపట్టి కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సింగరాయకొండకు చెందిన పల్లిపాటి ఏసుదాసు, మెదక్ జిల్లా చిన్న శంకరంపేట శాలిపేట్ గ్రామానికి చెందిన నర్రా శ్రీధర్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి 280 కిలోల కాపర్ వైర్‌ను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేశారు. అనంతరం ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ఆర్మూర్ ఏజేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ వేముల దీప్తి మంగళవారం నిందితులిద్దరికి ఒక సంవత్సరం పాటు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శంకర్

భిక్కనూరు: మండలంలోని శ్రీసిద్ధరామేశ్వరనగర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ మంగళవారం తెలిపారు. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన గంగల్ల శంకర్(28) అలీయాస్ శంభు అనే యువకుడు దినసరి కూలీగా పనిచేస్తాడు. సోమవారం రాత్రి దాబా హోటల్‌కు వెళ్లి భోజనం చేసి వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. శ్రీసిద్ధరామేశ్వరనగర్ శివారులో జాతీయ రహదారి డివైడర్ మధ్యలో మృతి చెంది పడి ఉండగా.. దగ్గరలో ఉన్న దాబా యాజమాని గజ్జె స్వామి మృతదేహాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు పరిశీలించి పంచనామా నిర్వహించారు. మృతుడి సోదరుడు గంగల్ల బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..



చికిత్స పొందుతూ మృతిచెందిన సుభాష్

ఎడపల్లి(బోధన్): మండలంలోని దూపల్లి గేటు వద్ద సోమవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎడపల్లి ఎస్సై పాండేరావు తెలిపారు. రెంజల్ మండలం దూపల్లికి చెందిన సుభాష్ అనే వ్యక్తి టీవీఎస్ మోపెడ్‌పై నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తూ దూపల్లి గేటు వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు అతడిని ఢీకొట్టింది. సుభాష్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా...

పోలీస్ శిక్షణకు ముమ్మర ఏర్పాట్లు

28 పోలీస్ శిక్షణ కేంద్రాలు సిద్ధం చేయాలని డీజీపీ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: త్వరలో భర్తీ కానున్న నూతన కానిస్టేబుళ్ల శిక్షణపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే నియామక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. దీంతో త్వరలో భర్తీ కానున్న 14,881 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు శిక్షణనిచ్చేందుకు రాష్ట్రంలోని 28 పోలీస్ శిక్షణ కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని డీజీపీ అంజనీ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాష్ట్రంలోని అన్ని పోలీస్ ట్రైనింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో వీడియో సదస్సు నిర్వహించారు. శిక్షణ విభాగం ఐజీ తరుణ్ జోషితో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ...రానున్న సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించనున్నామని వెల్లడించారు. శిక్షణ ప్రారంభానికి ముందుగానే అన్ని పోలీస్ ట్రైనింగ్ సెంటర్లలో (పీటీసీ) మౌలిక సదుపాయాల కల్పన, శిక్షణకు కావాల్సిన మెటీరియల్స్, వసతి తదితర సౌకర్యాలను సిద్ధం చేసుకోవాలని పీటీసీల అధికారులను ఆదేశించారు. భవనాలకు మరమ్మతులు, వైట్‌వాష్, టాయిలెట్ల సౌకర్యం, రీడింగ్ రూమ్ తదితర ఏర్పాట్లకు నిధులను అందచేస్తున్నామన్నారు. మహిళా ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్ శిక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

నేడు, రేపు తేలికపాటి వానలు

సాక్షి, హైదరాబాద్: ఒడిశా దాని పరిసరాల్లోని దక్షిణ జార్ఖండ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్ వద్ద ఉన్న అల్పపీడనం మంగళవారం తెలంగాణ నుండి దూరంగా వెళ్లిపోయిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కాగా, రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు సాధారణ స్థితిలో ఉన్నాయి. దీంతో బుధ, గురువారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. గత 24 గంటల్లో ఆదిలాబాద్ సహా ఆ జిల్లాలోని థంసి, కొమురంభీం జిల్లా సిర్పూరుల్లో 5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. కెరమెరి, తాల మడుగు, బెజ్జూరు, కాగజ్‌నగర్, వంకడి, ఆసిఫాబాద్, రంజాల్, జైనూర్, నవీపేట్‌లలో 3 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

దేవరకొండ కాలేజీ ప్రాంగణంలో మార్కెట్టా?

నల్లగొండ కలెక్టర్ ఉత్తర్వులను నిలిపివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: దాదాపు వేయి మంది విద్యార్థులు చదివే జూనియర్ కాలేజీ, ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉన్న స్థలంలో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఎలా ఏర్పాటు చేస్తారని అధికారులను హైకోర్టు ప్రశ్నించింది. ఇది ఎంత మాత్రం సమర్థనీయం కాదంటూ గత సంవత్సరం డిసెంబర్ 9న నల్లగొండ కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేసింది. తదుపరి వెల్లడించే వరకు ఈమధ్యంతర ఆదేశాలే అమలులో ఉంటాయని స్పష్టం చేసింది. విద్యాశాఖ కమిషనర్, నల్లగొండ కలెక్టర్, దేవరకొండ ఆర్డీవో, తహసీల్దార్‌సహా పలువురికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణ నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. నల్లగొండ జిల్లా దేవరకొండలో కళాశాలకు చెందిన 11 ఎకరాల భూమిలో 2 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణం చేపట్టాలంటూ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టులో దేవరకొండకు చెందిన టి.రవికుమార్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది తేరా రజనీకాంత్‌రెడ్డి వాదనలు వినిపించారు.

ఆగస్టు 30 వరకు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: దక్షిణమధ్య రైల్వేలోని వివిధ మార్గాల్లో అందుబాటులోకి తెచ్చిన 23 ప్రత్యేక రైళ్లను పొడిగించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆగస్టు 30 వరకు పొడిగించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–సుబేదార్‌గంజ్, లింగంపల్లి, కాకినాడ, కాచిగూడ–మధురై, సికింద్రాబాద్–రామనాథపురం, సికింద్రాబాద్–పట్నా, సికింద్రాబాద్–దానాపూర్, కాచిగూడ–నాగర్‌సోల్, తదితర మార్గాల్లో నడిచే రైళ్లను ఆగస్టు చివరి వరకు నడపనున్నట్లు పేర్కొన్నారు.

పండరీపూర్, తుల్జాభవానీ ఆలయాలను సందర్శించుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్



సర్కోలి సభకు హాజరైన ప్రజలు.. భగీరథ్ బాల్కేకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేసీఆర్



మాది రైతుల టీం

▶ మొదటి పేజీ తరువాయి

మాదిరిగా దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఎందుకు అభివృద్ధి సాధ్యం కాలేదని ప్రశ్నించారు. దేశంలో కోట్లాది ఎకరాల వ్యవసాయ భూమి, 75 వేల టీఎంసీల నీరు ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన విధానాలు అమలు చేస్తే ప్రతీ ఎకరాకు సాగునీరు అందించవచ్చన్నారు. నూతన జల విద్యుదుత్పత్తి విధానాలను బీఆర్‌ఎస్ లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. దేశంలోని బొగ్గు నిల్వలు 150 సంవత్సరాలపాటు అవసరాలను తీరుస్తాయని, రైతులు ఏకమైతేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా వంటి తెలంగాణ పథకాలు మహారాష్ట్రలోనూ అమలు కావాలన్నారు. పనిచేయని ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని, రైతుల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్‌లో చేరిన భగీరథ బాల్కేను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మంత్రిని చేస్తానని కేసీఆర్ ప్రకటించారు.

రైతు బతికుంటేనే ప్లేటులోకి భోజనం

'రైతు బతికుంటే ఎవరు మరణిస్తారు, రైతు మరణిస్తే ఎవరు బతుకుతారని నేను నిత్యం చెబుతుంటాను. రైతు జీవించి ఉంటేనే భోజనం మన ప్లేటులోకి వస్తుంది. రైతు మరణిస్తే అందరి భోజన పాత్రలు ఎండిపోతాయి. రైతులు లేకుంటే ఇక ఎవరు బతకగలరు' అని కేసీఆర్ చెప్పారు. మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ సర్కారు ఏర్పడితే రైతులందరికీ పెన్షన్ ఇవ్వడంతోపాటు సంక్షేమ కార్యక్రమాలన్నీ అమలు చేస్తామన్నారు. 'తుమ్మచెట్టును నాటితే మామిడి పండ్లు ఎలా కాస్తాయి. మామిడి పండ్లు తినాలనుకుంటే మామిడి చెట్టునే నాటాలి. పాలు కావాలంటే ఆవులకు గడ్డి వేయండి, గాడిదలకు గడ్డి వేసి, ఆవుల నుండి పాలు ఎలా పొందగలం' అంటూ ఓటు శక్తితో అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చని కేసీఆర్ అన్నారు.

ముగిసిన మహారాష్ట్ర పర్యటన

రెండురోజుల పర్యటనకు రోడ్డు మార్గంలో భారీ కాన్వాయ్‌తో వెళ్లిన కేసీఆర్ మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు తిరిగి చేరుకున్నారు. సోమవారం రాత్రి షోలాపూర్ బాలాజీ సరోవర్ హోటల్‌లో బస చేసిన కేసీఆర్ మంగళవారం ఉదయం రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలతోపాటు పండరీపూర్‌కు చేరుకున్నారు. 10 గంటలకు పండరీపూర్‌లోని శ్రీ విఠల్ రుక్మిణిదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం సర్కోలిలోని భగీరథ బాల్కే నివాసానికి చేరుకుని ఆయన తండ్రి స్మారకానికి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో కేసీఆర్ ప్రసంగించారు. తర్వాత పార్టీ నేతలతో కలిసి భాల్కే నివాసంలో భోజనం చేసి సాయంత్రం 4 గంటలకు సోలాపూర్‌కు చేరుకున్నారు. షోలాపూర్‌లోని స్థానిక కార్పొరేటర్ నగేశ్ వల్లియర్ నివాసానికి చేరుకుని పార్టీ నేతలతో కలిసి తేనీటి విందులో పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు తుల్జాపూర్ భవానీ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

విఠల్, రుక్మాయిలను దర్శించుకున్న కేసీఆర్

షోలాపూర్: పార్టీ విస్తరణలో భాగంగా షోలాపూర్ పర్యటనకు వచ్చిన బీఆర్‌ఎస్ చీఫ్, సీఎం కేసీఆర్ మంగళవారం ఉదయం పండరీపూర్‌లోని విఠల్, రుక్మాయిలను దర్శించుకున్నారు. ఉత్తరద్వారం నుంచి ఆలయంలోకి చేరుకున్న కేసీఆర్‌కు అర్చకులు, నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. విఠలేశ్వరుడి పాద ముద్రికలు, మూల విరాట్ విగ్ర హం దర్శనానంతరం కేసీఆర్ రుక్మిణీ అమ్మవారి పాదాలను పసుపు కుంకుమలతో అలంకరించి మొక్కుకున్నారు. అర్చకులు కేసీఆర్ మెడలో తులసిమాలను వేశారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని, వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆషాఢ ఏకాదశి పర్వదినానికి రెండు రోజులే ఉండటంతో ఆలయంలో, బయట భక్తుల రద్దీ విపరీతంగా ఉంది. దీంతో కేసీఆర్, కొందరు ప్రజాప్రతినిధులు మినహా ఆయన వెంట వచ్చిన మిగతా వారికి వీఐపీ దర్శనం కల్పించలేదు. దీంతో వారు ఆలయ శిఖర దర్శనం చేసుకుని వెనుదిరిగారు. అదేవిధంగా ముందుగా ప్రకటించిన ప్రకారం వేయి కేజీల గులాబీ పూలను హెలికాప్టర్ ద్వారా కురిపించేందుకు పోలీసులు అనుమతివ్వలేదు. హైదరాబాద్ నుంచి కేసీఆర్ వెంట వచ్చిన 600 వాహనాలను భద్రతా కారణాలతో పోలీసులు పండరీపూర్‌లోకి అనుమతించలేదు. కేసీఆర్ షోలాపూర్ నుంచి పండరీపూర్ ఆలయానికి వస్తున్న క్రమంలో స్థానికులు ఆయనను చూసేందుకు పోటీపడ్డారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు.

ముగ్గురి ప్రాణం తీసిన ఆన్‌లైన్ జూదం

- ఆన్‌లైన్ పేకాటలో రూ.లక్షలు పోగొట్టుకున్న మహిళ
- అప్పులు ఇచ్చినవారి ఒత్తిడి పెరగడంతో మనస్తాపం
- ఇద్దరు చిన్నారులను చంపేసి, తానూ ఆత్మహత్య

చౌటుప్పల్: ఆన్‌లైన్ పేకాట ముగ్గురి ప్రాణాలు బలిగొంది. ఆటలో డబ్బులు పోవడం, అప్పుల వాళ్ల ఒత్తిడి పెరగడంతో.. తీవ్ర మనోవేదనకు గురైన మహిళ తన ఇద్దరు కుమారులను నీటి సంపులో తోసి హత్య చేసింది. ఆపై తానూ అందులోనే దూకి ప్రాణాలు తీసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో జరిగిన ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండలం గొల్నేపల్లి గ్రామానికి చెందిన అవిశెట్టి నర్సింహ పెద్ద కుమారుడు మల్లేశ్‌కు భూదాన్ పోచంపల్లి మండలం దంతూరు గ్రామానికి చెందిన రాజేశ్వరి(28)తో పదేళ్ల కిందట పెళ్లైంది. వీరికి అనిరుధ్(5), హర్షవర్ధన్(3) కుమారులు. కొంతకాలం చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో ఉండి.. ఏడేళ్ల క్రితం చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి వచ్చారు. సాధారణ గృహిణి అయిన రాజేశ్వరి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. తన వద్దనున్న స్మార్ట్‌ఫోన్‌లో ఆన్‌లైన్ (పేకాట)గేమ్‌కు ఆకర్షితురాలైంది. వేలల్లో పెట్టుబడి పెట్టి పేకాట ఆడి చాలా నగదు పోగొట్టుకుంది. ఇంట్లో తెలియకుండా పలువురి వద్ద అప్పు చేసింది. మొత్తంగా సుమారు రూ.8లక్షల వరకు పోగొట్టుకోవడంతో విషయం ఇంట్లో తెలిసింది. ఆమె భర్త మల్లేశ్ ఇటీవలే కొంత అప్పు తిరిగి చెల్లించాడు. ఇంకొంతమందికి ఇవ్వాల్సి ఉంది. అది తీర్చేందుకు నారాయణపురంలో ఉన్న ప్లాటును విక్రయించాలని ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మల్లేశ్ ఇంటికి వచ్చిన అప్పు ఇచ్చిన వ్యక్తులు తమ డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేశారు. వాళ్లు వెళ్లిపోయాక, మల్లేశ్ సమీపంలోనే ఉన్న బంధువు వద్దకు వెళ్లాడు. కాసేపటి తరువాత వచ్చిన అతనికి ఇంటి ఆవరణలోనే ఉన్న నీటి సంపులో ఇద్దరు కొడుకులు, భార్య విగతజీవులుగా కనిపించారు. ముగ్గురి మృతితో చౌటుప్పల్‌లో విషాదం అలుముకుంది.

బీఆర్‌ఎస్‌కు ఓటేస్తే.. బీజేపీకి వేసినట్లే!

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజం
- బీజేపీకి బీఆర్‌ఎస్ మద్దతిస్తోంది
- మైనారిటీలను కేసీఆర్ మోసం చేశారు
- తెలంగాణలోనూ కర్ణాటక ఫలితమే వస్తుందని ధీమా



చివ్వెంల మండలం బి.చందుపట్ల గ్రామంలో డప్పు వాయిస్తున్న భట్టి విక్రమార్క

చివ్వెంల (సూర్యాపేట): కర్ణాటక ఎన్నికల్లో వచ్చిన ఫలితమే తెలంగాణలోనూ వస్తుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. బీఆర్‌ఎస్‌కు వేసే ప్రతి ఓటు బీజేపీ వేసినట్లేనని దుయ్యబట్టారు. లౌకిక పార్టీ కాంగ్రెస్‌కు ఓటు వేస్తేనే బీజేపీకి వ్యతిరేకంగా వేసినట్లు అవుతుందని చెప్పారు. భట్టి మంగళవారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం తిమ్మాపురం, బి.చందుపట్ల గ్రామాల్లో ప్రాదయాత్ర చేశారు. చందుపట్లలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని మోసం చేసిన కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మంత్రి కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలవడంతోనే బీజేపీ, బీఆర్‌ఎస్ వేర్వేరు కాదని మరోసారి స్పష్టమైందన్నారు. చట్టసభల్లో బీజేపీ తెచ్చిన అనేక బిల్లులకు బీఆర్‌ఎస్ ఎంపీలు మద్దతు తెలిపారన్నారు. భారత్ జోడో యాత్రకు భయపడి రాహుల్ గాంధీ అభ్యర్థిత్వాన్ని ప్రధాని మోదీ రద్దు చేయించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చట్టాలు తెచ్చినా బీఆర్‌ఎస్ మద్దతు ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు.. సీఎం కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి, బీసీ సబ్‌ప్లాన్ తెస్తామన్నారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్ష నెరవేరలేదని, నియామకాలు లేకపోవడంతోనే యూనివర్సిటీలు నిరుద్యోగులకు కేంద్రాలుగా మారాయని ఎద్దేవా చేశారు. రైతుబంధు మాత్రమే ఇచ్చి రైతులకు అన్ని రకాల సబ్సిడీలు రాష్ట్ర ప్రభుత్వం తొలగించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇళ్లులేని వారికి డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. కాగా, బి.చందుపట్ల గ్రామంలో భట్టి పత్తిచేను దున్నుతున్న రైతు వద్దకు వెళ్లి అరక పట్టి కొద్దిసేపు దుక్కిదున్నారు. గీత కార్మికులతో మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి, టీపీసీసీ మహిళా కాంగ్రెస్ చైర్మన్ సునీతారావు పాల్గొన్నారు.

పాపం పండే రోజు దగ్గరలో ఉంది: గద్దర్

చివ్వెంల(సూర్యాపేట): పదేళ్ల పాలనలో పాపం నిండిపోయింది.. ఆ పాపం పండే రోజు దగ్గరకు వచ్చింది.. అని ప్రజాపార్టీ వ్యవస్థాపకుడు గద్దర్ అన్నారు. ఆయన మంగళవారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్రకు మద్దతు తెలిపి మాట్లాడారు. ధరణి పేరుమీద రైతులను, ప్రశ్నపత్రాలను లీక్ చేసి విద్యార్థులను ప్రభుత్వం మింగేసిందని విమర్శించారు. భట్టి విక్రమార్క పాదయాత్ర చారిత్రకమైందన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు గీతాలు ఆలపించి.. మహిళలతో కోలాటం ఆడారు.

మాజీ ఎంపీ సోలిపేట రాంచంద్రారెడ్డి కన్నుమూత



బంజారాహిల్స్/దుబ్బాక టౌన్: రాజ్యసభ మాజీ సభ్యుడు సోలిపేట రాంచంద్రారెడ్డి (88) మంగళవారం ఉదయం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని తన నివాసంలో కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నా రు. మంగళవారం సాయంత్రం ఫిలింనగర్ మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి.

మచ్చలేని వ్యక్తిగా పేరు: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం చిట్టాపూర్‌కు చెందిన సోలిపేట రాంచంద్రారెడ్డి 1935 మే 17న మాలిపటేల్ గాలిరెడ్డి–సుందరమ్మ దంపతులకు జన్మించారు. స్వగ్రామం చిట్టాపూర్‌లో ప్రాథమిక, సిద్దిపేటలో హైస్కూల్ విద్యాభ్యాసం కొనసాగింది. రాంచంద్రా రెడ్డి తొలితరం కమ్యూనిస్టు నాయకుల స్ఫూర్తితో తెలంగాణ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారు. సిటీ కాలేజీలో పట్టభద్రులైన రాంచంద్రారెడ్డి రాజకీయాల్లో పూర్తి కాలం పనిచేశారు. 70 ఏళ్లపాటు రాజకీయాల్లో క్రియాశీలకంగా పని చేసి మచ్చలేని వ్యక్తిగా పేరొందారు.

సర్పంచ్ నుంచి ఎంపీ వరకు..

చిట్టాపూర్ తొలి సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం (1955 నుంచి 1964 వరకు) చేపట్టిన రాంచంద్రారెడ్డి 1972 నుంచి 1978 వరకు దొమ్మాట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పనిచేశారు. 1996 నుంచి 2002 వరకు టీడీపీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎంపికై రాజ్యసభలో టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా, రాజ్యసభ అస్యూరెన్స్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. కమ్యూనిస్టుగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి కాంగ్రెస్, టీడీపీలో కీలక పదవుల్లో పనిచేశారు. అలాగే దుబ్బాక సమితి అధ్యక్షుడిగా, సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, మెదక్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడిగా, భారత్–చైనా మిత్ర మండలికి అధ్యక్షుడిగా, సీఆర్ ఫౌండేషన్, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్‌లకు ఆయన సేవలు అందించారు. కొంతకాలం లోక్‌సత్తాలోనూ పనిచేశారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, సీఎంలు చెన్నారెడ్డి, ఎన్టీఆర్, చంద్రబాబు, సీఎం కేసీఆర్‌లతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ప్రముఖ కవి సినారెకు రామచంద్రారెడ్డి వియ్యంకుడు. డాక్టర్ సి.నారాయణరెడ్డి చిన్న కుమార్తెను తన పెద్ద కుమారుడు వెంకటేశ్వరరెడ్డికి చేసుకున్నారు.

సీఎం సంతాపం: సోలిపేట రామచంద్రారెడ్డి మృతిపట్ల ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు సంతాపాన్ని ప్రకటించారు. నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న సోలిపేట జీవితం ఆదర్శవంతమైందని గుర్తుచేశారు.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తులసిచందు. చిత్రంలో వివిధ సంఘాల నేతలు

ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కుతున్నారు

- స్వతంత్ర జర్నలిస్ట్ తులసిచందు ఆవేదన
- 'జర్నలిజం–ట్రోల్ ముఠాలు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం
- ట్రోలింగ్ ముఠాలకు తగిన గుణపాఠం చెప్పాలన్న వక్తలు
- తులసీచందుకు జర్నలిస్టులు, ప్రజా సంఘాల మద్దతు

పంజగుట్ట (హైదరాబాద్): ప్రశ్నించే జర్నలిస్టుల గొంతులను కొందరు మతవాదంతో అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని స్వతంత్ర జర్నలిస్టు తులసిచందు అన్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో 'మతం వస్తుంది మేలుకో' అని వీడియో చేసినందుకు తనపై యాంటీ హిందూ ముద్ర వేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తాను పెట్టిన కంటెంట్ మీద ఫేస్‌బుక్‌లో ఎటాక్ జరిగిందన్నారు. మంగళవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, హైదరాబాద్ ప్రెస్‌క్లబ్, నెట్‌వర్క్ ఆఫ్ ఉమెన్ ఇన్ మీడియా, తెలంగాణ స్టేట్ స్మాల్ అండ్ మీడియం పేపర్స్, మేగజైన్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో 'జర్నలిజం– ట్రోల్ ముఠాలు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, పాశం యాదగిరి, కె.శ్రీనివాస్, వేణుగోపాల్, ప్రొఫెసర్ పద్మజాషా, సామాజిక కార్యకర్తలు సజయ, పీవోడబ్ల్యూ సంధ్య, రాజకీయ విశ్లేషకులు డాక్టర్ మిత్రలతో పాటు 39 పౌరసంఘాలు పాల్గొని తులసిచందుకు సంఘీభావం తెలిపాయి. తులసిచందు మాట్లాడుతూ, తాను ఏ వార్తను సృష్టించ లేదని, అయినా తనను శత్రువుగా, అర్బన్ నక్సలైట్‌గా చిత్రీకరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలపై దాడులు చేస్తున్నవారి వెనక ఎవరు ఉన్నారో ఆరాతీయాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ నేతలను, ప్రధానిని ప్రశ్నించే వారిపై నేరుగా దాడులు చేసేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారని ఆమె ఆరోపించారు. తనపై దాడి చేస్తున్న మూడు యూట్యూబ్ చానల్స్, ఒక ఫేస్‌బుక్ ఖాతాపై కేసు పెట్టానని వెల్లడించారు. ప్రశ్నించే జర్నలిస్టులపై దాడులు చేస్తే అంతా ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు.

దేవులపల్లి అమర్ మాట్లాడుతూ, సోషల్ మీడియా వెలుగులోకి వచ్చాక ఇండిపెండెంట్ జర్నలిజం విస్తృతంగా ప్రాచుర్యం పొందిందని తెలిపారు. గతంలో వార్తాపత్రికలే ఉన్నప్పుడు ఒక సంస్థపైగానీ, వ్యక్తిపైగానీ వ్యతిరేక వార్తలు రాస్తే యాజమాన్యానికి, సంపాదకులకు ఫిర్యాదు చేసేవారని, సోషల్ మీడియా పెరుగుతున్న క్రమంలో ఇండిపెండెంట్ జర్నలిజంలో ఏ సంపాదకుని కట్టడి లేకుండా పోయిందన్నారు. ఇండిపెండెంట్ జర్నలిజం రావడం చాలామందికి ఇష్టం ఉండదని, అదే తులసిపై దాడికి దారితీసిందని అన్నారు. తులసికి తానుపూర్తి సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ, సమాజంలో దళిత, మైనార్టీ మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, ఈ దాడి తులసి మీద కాకుండా యావత్ మహిళలపై దాడిగా భావించాలన్నారు. తులసికి పౌరహక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

జూలై 8న హైదరాబాద్‌లో బీజేపీ సమావేశం

హాజరుకానున్న 11 రాష్ట్రాల అధ్యక్షులు, సంస్థాగత జీఎస్‌లు

సాక్షి, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాలతోపాటు వాటికి ఆనుకుని ఉన్న 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధానకార్యదర్శుల సమావేశం వచ్చేనెల 8న హైదరాబాద్‌లో జరగనుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ హాజరుకానున్న ఈ భేటీలో వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించనున్నారు. ఈ ఏడాది చివర్లోగా ఐదు రాష్ట్రాల ఎన్నికలతో సహా 2024 ఏప్రిల్‌లో జరగనున్న లోక్‌సభకు సన్నద్ధమయ్యే విషయంపైనా చర్చ జరగనుంది. తెలంగాణతో సహా ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, గోవా, లక్షద్వీప్, అండమాన్–నికోబార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌ల నుంచి నేతలు పాల్గొననున్నారు. కొన్ని నెలల క్రితం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ప్రాథమికంగా చర్చలు జరపగా, అందులో చర్చించిన అంశాలు, సాధించిన లక్ష్యాలను ఈ సమావేశంలో సమీక్షించనున్నారు. ఈ సమావేశం ముగిశాక సాయంత్రం.. ప్రధాని మోదీ లేదా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొనేలా బహిరంగసభ నిర్వహించాలనే ఆలోచనలో రాష్ట్ర పార్టీ ఉంది.

కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేయాలి



రామారెడ్డిలో నిరసన తెలుపుతున్న ముదిరాజ్ కులస్తులు

- ముదిరాజ్ కులస్తుల డిమాండ్
- రామారెడ్డిలో ర్యాలీ

రామారెడ్డి (ఎల్లారెడ్డి): ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ముదిరాజ్ కులస్తులపై చేసిన తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో వెంటనే అతడిని పదవి నుంచి తొలగించి.. అరెస్టు చేయాలని ముదిరాజ్ కులస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం రామారెడ్డిలో ర్యాలీ నిర్వహించి కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నేత గురిజ కుంట స్వామి మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్తులపై కౌశిక్ రెడ్డి చేసిన తీవ్ర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌కు వినతిపత్రం చేశారు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో నిర్వహించిన ర్యాలీకి బీసీ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సిద్ధి రాములు, సర్పంచ్ సంజీవ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రంగు రవీందర్‌గౌడ్, అంజయ్య, బీబీపేట నర్సింలు, బండకింది రమేశ్, ఉస్కె రాజేందర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛత పాటించాలి



కామారెడ్డి టౌన్: గ్రామాల్లో ప్రజలు ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛత పాటించాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ వెస్లీ ప్రజలకు సూచించారు. మంగళవారం సాయంత్రం ఆయన మండలంలోని ఉగ్రవాయిలో స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా పర్యటించారు. గ్రామంలోని కంపోస్టు షెడ్డు, ఇంకుడు గుంతలను పరిశీలించారు. సానిటేషన్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పీడీ సాయన్న, డీఎల్‌పీవో సాయిబాబా, ఎస్‌డీఎం కో–ఆర్డినేటర్ నారాయణ, అధికారులు మధుకృష్ణ, సబితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత టోల్ ప్లాజా నిర్మించండి



భిక్కనూరు: భిక్కనూరు టోల్‌ప్లాజాలో శాశ్వత నిర్మాణం లేకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని.. దీంతో తాము గాయాలపాలవుతున్నామని.. వెంటనే నిర్మాణం చేపట్టాలని టోల్ సిబ్బంది నేషనల్ హైవే పీడీ శ్రీనివాస్ రావుకు మంగళవారం విన్నవించారు. సోమవారం రాత్రి కంటైనర్ బీభత్సం సృష్టించడంతో ఒకరు గాయపడడంతో పాటు బూత్‌లు ధ్వసమవడంతో హైవే పీడీ శ్రీనివాస్ టోల్‌ప్లాజా వద్దకు వచ్చారు. ఆయన రాగానే సిబ్బంది తమ ఇబ్బందులను ఆయనకు వివరించారు. వచ్చేనెల ఐదో తేదీన టోల్ ప్లాజా శాశ్వత నిర్మాణానికి టెండర్లను పిలుస్తున్నట్లు చెప్పారు. కొన్ని కారణాల వల్ల శాశ్వత నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయని సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా అధ్యక్షుడు నర్సగౌడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం పలకాలి

పెర్కిట్(ఆర్మూర్) : తెలంగాణలో కుటుబ పాలనకు చరమగీతం పలకాలని ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరుస్తున్నారని ఎంపీ అర్వింద్ అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో మంగళవారం మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర ప్రసంగాన్ని ఎంపీ అర్వింద్ నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరినప్పటికీ బీజేపీ మాత్రమే గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లె గంగారెడ్డి, సీనియర్ నాయకులు పైడి రాకేష్ రెడ్డి, నూతుల శ్రీనివాస్ రెడ్డి, జెస్సు అనిల్, పాలెపు రాజు, రోహిత్ రెడ్డి పాల్గొన్నారు.

అవినీతి జరిగింది రూ.16 లక్షలే!



కలెక్టరేట్‌కు వచ్చిన బాబాగౌడ్

కామారెడ్డిక్రైం: తాను రూ. 36లక్షలు అవినీతికి పాల్పడినట్లు మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయని, రూ.16 లక్షలు మాత్రమే అవకతవకలు జరిగాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈమేరకు తాడ్వాయి మండలం నందివాడ వీవోఏ బాబాగౌడ్ పేర్కొన్నాడు. ఈమేరకు మంగళవారం ఆయన, కుటుంబ సభ్యులు కామారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చి, వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాబాగౌడ్ మాట్లాడుతూ.. ఎలాంటి ఆధారాలు లేకుండానే తాను రూ. 36లక్షలు అవినీతికి పాల్పడినట్లు మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయని అన్నారు. వచ్చిన ఆరోపణల్లో ఆధారాలతో కూడిన రూ.16 లక్షలు మాత్రమే తాను కట్టేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. మిగిలిన రూ. 20 లక్షలు తనకు సంబంధం లేదన్నారు. తనపై గ్రామ డ్వాక్రా మహిళలు, డీపీఎం రవీందర్‌రావు తయారు చేసిన నివేదిక అవాస్తవమన్నారు. ఉన్నతాధికారులు పూర్తి విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని కోరాడు.

వేములది బెదిరింపుల రాజకీయం



మాట్లాడుతున్న ఏలేటి మల్లికార్జున్ రెడ్డి

భీమ్‌గల్ : మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిది బెదిరింపుల రాజకీయమని, అభివృద్ధి పనులకు టెండర్లు వేయడానికి వచ్చే కాంట్రాక్టర్లను బెదిరింపులకు గురిచేసి తనకు కావాల్సిన వారికే కాంట్రాక్టులు వచ్చేలా చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గంలో అవినీతిని నిరూపించాలంటూ ఇటీవల మంత్రి వేముల చేసిన సవాల్‌కు కౌంటర్‌గా మంగళవారం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన రోడ్డు పనులకు 90 శాతం వరకు మంత్రి బంధువైన రమేశ్‌రెడ్డి చేస్తున్నాడరని, వేరే కాంట్రాక్టర్లకు ఎందుకు ఇవ్వట్లేదని ఆయన ప్రశ్నించాడు. ఆర్టీఐ ఆక్ట్ ద్వారా బట్టాపూర్ క్వారీ గురించి సేకరించిన ఆధారాల మూలంగా క్వారీ ఓనర్‌కు నోటీసులు పంపితే వాళ్ల నివేదికలో 9280 క్యూబిక్ మీటర్ల వరకు ఉన్న అనుమతితో సంబంధం లేకుండా, అదనంగా 61,600 క్యూబిక్ మీటర్ల వరకు తవ్వకాలు జరిపామని, అలా తవ్వినందుకు ప్రభుత్వానికి రూ. 1,15,50,670లు పన్ను చెల్లించామని స్వయానా మంత్రి బంధువైన శ్రీకాంత్ ఓ నివేదికలో తెలియజేసిన, ఆ క్వారీ పై ఇప్పటి వరకు చర్యలు ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని అన్నారు. నియోజకవర్గంలోని కమ్మర్‌పల్లి, బాల్కొండ క్వారీలను అన్యాయంగా బంద్ చేయించి బట్టపూర్‌లోనే కంకర దొరుకుతుందని మంత్రి చెప్పడం హాస్యాస్పదమన్నారు. సవాల్ చేసిన మంత్రి ఒకసారి ఆత్మ విమర్శ చేసుకోవాలని, ఎవరు ఎన్ని అక్రమాలు చేస్తున్నారో, ఎంత దోచుకుంటున్నారో, నిజాలు అన్నీ మీడియా ఎదుట బయట పెడుతున్నామని మల్లికార్జున్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రూ. 10 కోట్లు ఇస్తే బట్టాపూర్ క్రషర్ అమ్ముతానంటున్నాడని, మంచిధర వస్తే సచివాలయాన్ని కూడా అమ్మేస్తారని మంత్రిని ఉద్దేశిస్తూ విమర్శించారు.